

జ్వర పీడితులు

- సర్కారు దవాఖానాలకు క్యూ కడుతున్న బాధితులు
- అధికంగా నమోదవుతున్న డయేరియా కేసులు
- కిట్ పద్ధతిలో పాజిటివ్ వస్తున్న డెంగీ.. మాక్‌ఎలిజా ప్రామాణికం
- పలు జిల్లాల్లో చికున్ గున్యాతో సతమతమవుతున్న రోగులు
- కలుషిత నీరు, దోమల ప్రభావమే కారణమంటున్న వైద్యులు



వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీ కోసం క్యూలైన్లో ఉన్న జ్వరపీడితులు



పాలమూరు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద ఓపీ కోసం క్యూలైన్లలో ఉన్న రోగులు

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వైరల్ ఫీవర్ల కారణంగా ప్రజలు సతమతమవుతున్నారు. మెజారిటీ ఆసుపత్రుల్లో జ్వర పీడితుల సంఖ్య పెరిగిపోతోంది. ప్రధానంగా ప్రభుత్వాస్పత్రులకు వచ్చే వారు అధికంగా ఉంటున్నారు. వానాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన లేకపోవడంతో ఈసారి తీవ్రత ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ జనరల్ దవాఖానాలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వచ్చే ఔట్ పేషెంట్లలో 80 శాతం వరకు జ్వరపీడితులే ఉంటున్నారు. డెంగీ,చికున్ గున్యా తదితర కేసులు కూడా పలుచోట్ల నమోదవుతున్నాయి. డెంగీ కేసులకు సంబంధించి ప్రతీరోజు రక్త కణాలు తగ్గుతున్న వారి నమూనాలను సేకరించి.. టీ హబ్‌లకు పంపిస్తుండగా.. కిట్ పద్ధతిలో మెజారిటీ రోగులకు డెంగీ పాజిటివ్‌గా నిర్ధారణ అవుతోంది. అయితే వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు మాత్రం డెంగీ కేసుల నిర్ధారణలో కిట్ పద్ధతి కాకుండా మాక్‌ఎలిజా (ఎన్‌ఎస్1, ఐజీఎం, ఐజీజీ) పరీక్ష ప్రామాణికంగా తీసుకుంటుండటంతో.. ఈ పద్ధతిలో పాజిటివ్ కేసుల సంఖ్య తక్కువగా ఉంటోందని చెప్పవచ్చు. మాక్ ఎలిజా టెస్టుల్లో నిర్ధారణకాని డెంగీ కేసులను కేవలం అనుమానిత కేసులుగానే గుర్తిస్తున్నారు. వానాకాలం కావడంతో నిల్వ నీరు అధికంగా ఉండి.. దోమల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. పట్టణాల్లో ఖాళీ ప్లాట్లు, రోడ్ల వెంట గుంతల్లో దోమల వ్యాప్తి విపరీతంగా జరుగుతోంది. బురద గుంటల్లో విడుదల చేసే గంబూజియ చేపలను ఈసారి అనుకున్న స్థాయిలో విడుదల చేయలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కారణంగా జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉంటోంది. ప్రస్తుతం అన్ని ఆసుపత్రుల్లో కావాల్సిన మందులు అందుబాటులో ఉండటంతోపాటు.. ఇన్‌పేషెంట్‌కు బెడ్లు కూడా అందుబాటులో ఉంటున్నాయి. ఓపీకి వచ్చే జ్వర పీడితుల సంఖ్య అధికంగా ఉండటంతో.. ఆసుపత్రుల వద్ద క్యూలైన్లు దర్శనమిస్తున్నాయి. జ్వర తీవ్రత ఎక్కువగా ఉన్నవారు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి.. చికిత్స చేయించుకుంటున్నారు.

డయేరియా కేసులే అధికం..

ఉమ్మడి పాలమూరులోని ప్రతీ జిల్లాలో డయేరియా కేసులే అధికంగా నమోదవుతున్నాయి. మిషన్ భగీరథ ద్వారా ప్రతీ ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని నాయకులు చెబుతున్నప్పటికీ.. కలుషిత నీటిని తాగడం వల్ల నమోదయ్యే డయేరియా కేసులే అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఉమ్మడి జిల్లాలో 2023 సంవత్సరంలో నాలుగు వేలకు పైగా డయేరియా కేసులు నమోదు కాగా.. ఈ సంవత్సరం ఒక్క నారాయణపేట జిల్లాలోనే 8,663 కేసులు నమోదయ్యాయి. వనపర్తిలో 558, నాగర్‌కర్నూలులో 133, గద్వాలలో 143 కేసులు నమోదుకాగా.. మహబూబ్‌నగర్‌లో దాదాపు వెయ్యికి పైగా డయేరియా కేసులు నమోదయినట్లు తెలుస్తోంది. తక్కువగా నమోదు ఉన్న జిల్లాల్లో కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ తక్కువ చేసి చూపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. డయేరియా కారణంగా వాంతులు, విరేచనాలు అధికంగా ఉంటాయి. రోగులు డీహైడ్రేషన్‌కు కూడా గురవుతున్నారు. జ్వరం ఎక్కువై.. ఇతరత్రా సమస్యలకు దారితీస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అలాగే కలుషిత నీటి వల్ల చర్మ వ్యాధుల సంఖ్య తీవ్రంగా ఉంది. ప్రస్తుతం ఉమ్మడి పాలమూరులోని అన్ని జిల్లాలు, పట్టణాలు, గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా కృష్ణానది నీరు అధికంగా సరఫరా అవుతోంది. ప్రస్తుతం కొత్త నీరు వస్తున్న క్రమంలో ఒండ్రు ప్రభావం నీటిలో ఎక్కువగా ఉంటుంది. నిల్వ నీటిలో ఒండ్రు కిందకు జారిపోవడం ద్వారా నీరు తేటగా మారుతుంది. ప్రస్తుతం భారీ వరదలు వస్తున్న క్రమంలో నీటిశుద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ.. సరైన పద్ధతిలో మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల వద్ద నీటి శుద్ధి జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. క్లోరినేషన్ ప్రక్రియతోపాటు ఆలం ముక్కలు వేయడం, ఫిల్టర్‌బెడ్లు, నీటి ట్యాంకులను సరైన సమయంలో శుభ్రం చేయకపోవడంతో కలుషిత నీటిని తాగడం వల్ల ప్రజలు దురద, వాంతులు, విరేచనాల బారిన పడుతున్నారు. ప్రతీఏటా సరైన పద్ధతిలో మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, స్టోరేజీ ట్యాంకుల వద్ద పరిశుభ్రత చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

డెంగీ, చికున్ గున్యా కేసులు కూడా..

పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జీజీహెచ్‌లకు వచ్చే కేసుల్లో జ్వర పీడితులు అధికంగా ఉంటున్న నేపథ్యంలో అధికారులు జ్వర లక్షణాలు బట్టి డెంగీ, చికున్ గున్యా పరీక్షలు నిర్వహిస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటివరకు ఈ సంవత్సరం 86 డెంగీ కేసులు నమోదయ్యాయి. 11 చికున్ గున్యా కేసులను నిర్ధారించారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 2023లో 184 డెంగీ కేసులు నమోదు కాగా.. 2024లో ఇప్పటి వరకు 14 కేసులు మాక్ ఎలిజాలో పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యాయి. వనపర్తి జిల్లాలో 2023లో 19 కేసులు నమోదు కాగా.. 2024లో ఇప్పటి వరకు 10 కేసులు నమోదయ్యాయి. చికున్ గున్యా కేసులు గతేడాది ఒక్కటి కూడా నమోదు కాలేదు. కానీ ఈ ఏడాది ఇప్పటి వరకు 17 కేసులు నమోదయ్యాయి. నారాయణపేట జిల్లాలో డెంగీ కేసులు గతేడాది 38 నమోదు కాగా.. 2024లో 11 కేసులు వచ్చాయి. ఒక మలేరియా కేసు కూడా ఇక్కడ నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో గతేడాది 27 డెంగీ కేసులు నమోదుకాగా.. ఈ ఏడాది ఇప్పటివరకు ఏడు కేసులు నమోదయ్యాయి. వైరల్ ఫీవర్ కేసులు కూడా వందల సంఖ్యలో నమోదవుతున్నాయి. మునిసిపాలిటీలు, నదీపరివాహక ప్రాంతాల్లో దోమల బెడద తీవ్రంగా ఉండటంతో ఈ కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్టు స్పష్టమవుతోంది. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, కాచి, వడపోసిన నీటిని తాగడం, నిల్వ ఉన్న నీటిని పారబోయడం, వ్యక్తిగత స్టోరేజీ ట్యాంకులను క్లీన్ చేసుకోవడం ద్వారా డయేరియాతో పాటు వైరల్ ఫీవర్స్‌ను అరికట్టే అవకాశం ఉంటుంది.



మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఐపీ విభాగంలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో పురోగతి లేదు

- పోలీసు యంత్రాంగంపై మాజీ మంత్రి ఆగ్రహం
- త్వరలో డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తాం
- బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన నిరంజన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

చిన్నంబావి, ఆగస్టు 13: శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో పురోగతి లేదని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని లక్ష్మీపల్లి గ్రామంలో బొడ్డు శ్రీధర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శ్రీధర్ రెడ్డి హత్య జరిగి మూడు మాసాలైన పోలీసు అధికారులు కేసులో నిందితులను ఇప్పటి వరకు గుర్తించకపోవడం విడ్డూరమని అన్నారు. హత్య కేసులో వారి తల్లిదండ్రులు కొందరిని అనుమానితులుగా ఫిర్యాదు చేసినా, సదరు వ్యక్తుల పేర్లు తొలగించాలని పోలీసులు కోరడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేసులో ఎలాంటి పురోగతి లేదని, నిజాలను నిగ్గుతేల్చకపోతే త్వరలో డీజీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. హత్య కేసు ఛేదనలో పోలీసు అధికారులు అమాయకులను విచారణ పేరుతో వేధిస్తూ వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కానీ బాధిత కుటుంబ సభ్యులు సూచిస్తున్న వ్యక్తులను విచారించకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో హత్య జరిగితే ఓ మంత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించకుండా హత్యకు గురైన వ్యక్తిపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ కేసును నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ హత్య కేసుపై డీజీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సిట్‌పై నమ్మకం ఉందని త్వరగా కేసును ఛేదించాలని కోరారు. నియోజకవర్గ మంత్రి తన కనుసన్నల్లో ఉండే పోలీసు అధికారులకు పోస్టింగ్ ఇచ్చి రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు వెంకట్రామమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు రంగినేని అభిలాష్ రావు, చిన్నారెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిండి కుడి కాలువ.. రైతులు కుదేలు



డిండి ప్రాజెక్టు (ఫైల్)

- నెలరోజులైనా ముందుకు సాగనీ కుడి కాల్వ నీరు
- 375 ఎకరాలు సాగు కాగితాలకే పరిమితం
- 1997 నుంచి ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో నీరు అందిన దాఖలాలు లేవు

అచ్చంపేట, ఆగస్టు 13: దుందుబీ నదిపై డిండి ప్రాజెక్టు పూర్తిగా ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే ఉన్నా లబ్ధిమాత్రం నల్లగొండ జిల్లాకు చేకూరుతోంది. 1997కు ముందు ఉప్పునుంతల మండలం పెనిమిళ్ల, గువ్వలోనిపల్లి, లత్తీపూర్ తదితర గ్రామాల రైతులు, నాయకుల పోరాటంతో అదే సంవత్సరం రూ 6.31 కోట్ల నాబార్డు నిధులు ఖర్చు చేసి డిండి ప్రధాన అనకట్టను పెంచారు. 375 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏడు కిలోమీటర్ల మేర కుడి కాల్వను తవ్వారు. కానీ నాటి నుంచి నేటి వరకు ఈ కాల్వ ద్వారా ఒక్క పంటకు కూడా నీరివ్వలేదు. డిండి ప్రాజెక్టు సమీపంలోని దాదాపు 20నుంచి 30 ఎకరాల్లో జాలు నీటి ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారు. డిండి ప్రాజెక్టు కుడి భాగంలో నిర్మించిన కాల్వ అనుకున్న మేర నిర్మాణం చేపట్టక పోవడం వల్లనే నీరు రావడం లేదని ఆరోపణలు ఉన్నాయి. కాల్వ నిర్మాణం చేపట్టిన తర్వాత కాల్వవైపు చూడలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా డిండి కుడికాల్వ అయకట్టు రైతులకు మేలు చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నెల రోజులు అవుతున్నా చివరి ఆయకట్టుకు చేరని నీరు

గత నెల 23న డిండి కుడి, ఎడమ కాల్వలకు నీటిని విడుదల చేశారు. ఎడమ కాల్వ ద్వారా డిండి మండలంతో పాటు చందంపేట మండలంలో దాదాపు రూ.20వేల ఎకరాలకు సాగునీరు అందడంతో రైతులు వరినాట్లతో బిజీగా మారారు. కుడికాల్వ అయకట్టు రైతులకు కాల్వ నీరు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మర్రికుంటకు నీరు ఇంకా చేరకపోవడంతో కుంట నిండేది ఎప్పుడు పంట పండేది ఎప్పుడని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా కుడి కాల్వ


డిండి ప్రాజెకు కుడి కాల్వ అస్తవ్యస్తంగా మారింది. చాలా వరకు పిచ్చిమొక్కలతో నిండిపోయింది. కాల్వ మరమ్మతులు పూర్తిస్థాయిలో చేయకపోవడంతో నీరు వదిలి నెల రోజులైనా అయకట్టు చివరివరకు పారడం లేదు. ఎక్కువ మొత్తంలో నీటిని విడుదల చేసినా కాల్వలకు ఇరువైపుల నుంచి దొర్లిపోయే ప్రమాదం ఉంది.



ఒక్క ఎకరం కూడా పారడం లేదు

నాకు రెండు ఎకరాల భూమి ఉంది, కాలువ తవ్విన నాటి నుంచి ఇంతవరకు ఎప్పుడు నీళ్లు పూర్తిగా వచ్చినట్టు నేను చూడలేదు. ఇక్కడి నాయకులు ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోయినా పనికాలేదు. డిండి కుడి కాల్వను బాగుచేస్తే ఎంతో మంది రైతులకు మేలు జరుగుతుంది.

- నిరంజన్, రైతు గువ్వలోనిపల్లి



పిచ్చి మొక్కలతో కమ్ముకుపోయిన కుడి కాల్వ



నీటి వసతి లేకపోవడంతో మర్రికుంట వద్ద బీడుగా మారిన పంట పొలాలు

పోలీసుల అదుపులో చోటేమియా

నాగర్‌కర్నూల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అధిక వడ్డీ ఆశ చూపి జనాన్ని మోసగించిన చోటేమియా పోలీసుల అదుపులో ఉన్నాడు. తెలకపల్లి మండలం నడిగడ్డకు చెందిన చోటేమియా అతని బంధువులు, స్నేహితులకు అధిక వడ్డీ ఆశ చూపి దాదాపు రూ.5 నుంచి రూ.6కోట్ల వరకు కుచ్చుటోపి వేసిన విషయం తెలిసిందే. ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు రావడంతో 15రోజుల క్రితం నాగర్ కర్నూల్‌కు వచ్చిన చోటేమియా అందరికీ తాను తీసుకున్న డబ్బులు చెల్లిస్తానని భరోసా ఇచ్చి రెండురోజుల వ్యవధిలోనే పలాయనం చిత్తగించాడు. ఈ క్రమంలో బాధితులు ఎస్పీని, స్థానిక ఎమ్మెల్యేను ఆశ్రయించారు. చోటేమియా భార్య కూడా పోలీస్‌స్టేషన్‌లో తన భర్తపై మిస్సింగ్ కేసు పెట్టింది. ఈ క్రమంలో చోటేమియా మంగళవారం ఉదయం 11గంటలకు సీఐ కనకయ్య దగ్గర లొంగిపోయాడు. విషయాన్ని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నిర్ధారించారు. అధిక వడ్డీ పేరుతో మోసపోయిన బాధితులకు న్యాయం చేసే క్రమంలో ఎలాంటి చర్యలు తీసుకుంటారో తెలియాల్సి ఉంది.



చోటేమియా (ఫైల్)



నాగర్‌కర్నూల్ జిల్లా.. కొల్లాపూర్ మండలం సోమశిల వద్ద రైతులు సాగు చేసిన పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఒక వైపు పచ్చని పంటలు.. మరోవైపు కృష్ణమ్మ పరవళ్లను చూసి పర్యాటకులు ఆనందంతో పరవశించిపోతున్నారు.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వనపర్తి

కదిలిన యంత్రాంగం

- వసతి గృహాలను పరిశీలిస్తున్న అధికారులు
- కోడూరులో విద్యార్థులతో కలిసి భోజనం చేసిన కలెక్టర్
- కోయిలకొండలో ఏసీబీ అధికారుల తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కోడూరు కేజీబీవీలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 : వసతి గృహాల్లో నాసిరకమైన భోజనంతో ఎంతో మంది విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు.. ఇదే విషయమై ఈ నెల 10న ఆంధ్రజ్యోతిలో 'ఫుడ్‌పాయిజన్' శీర్షికన కథనం వెలువడంతో అధికార యంత్రాంగం కదిలింది.. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు వసతి గృహాలను తనిఖీ చేస్తున్నారు. మంగళవారం ఏసీబీ అధికారులు సంబంధిత శాఖల అధికారులతో కలిసి కోయిలకొండ బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. కలెక్టర్ విజయేందిర బోయి కోడూరు కేజీబీవీని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మరోవైపు మునిసిపల్ కమిషనర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, తహసీల్దార్‌ల బృందం రాంరెడ్డిగూడ రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. ఇలా ఏకకాలంలో అధికారయంత్రాంగం వసతిగృహాలను తనిఖీ చేయడంతో నిర్వాహకులలో టెన్షన్ మొదలైంది.. ఎక్కడికక్కడ దిద్దుబాటు చర్యలకు శ్రీకారం చుట్టారు. వరుస తనిఖీలతో వసతిగృహాలలో వసతులు ఇప్పుడిప్పుడే మెరుగుపడుతున్నాయి. ఈ మార్పు కారణంగా విద్యార్థులలోనూ ఆనందం వ్యక్తం అవుతోంది.. కోయిలకొండ బీసీ వసతి గృహాన్ని తనిఖీ చేసిన ఏసీబీ అధికారులు అక్కడి వసతులు, అందిస్తున్న భోజనంపై అసంతృప్తిని వ్యక్తం చేశారు. నాసిరకం సరుకులున్నాయని, మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని, ఈ విషయాలను డీజీకి రిపోర్ట్ చేస్తానని వెల్లడించడంతో వార్డెన్‌లు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దీన్ని బట్టి వసతి గృహాల్లో విద్యార్థులకు ఏరకమైన వసతులు అందుతున్నాయో అర్థమవుతోంది. చాలా వసతి గృహాల్లో ఏం జరుగుతుందో బయటకు తెలియని పరిస్థితి నెలకొంది. మీడియాను కూడా అనుమతించకుండా జాగ్రత్త పడుతున్నారు. విద్యార్థులను తమ ఆధీనంలో ఉంచుకుని వారికి సరైన వసతులు కల్పించడం లేదు. వసతి గృహాలకు వచ్చే సరకులలో సగం పక్కదారి పడుతున్నాయన్న ఆరోపణలున్నాయి. నాలుగైదు రోజులుగా తనిఖీలు పెరగడంతో వార్డెన్‌లు అక్కడే అంటూ పరిసరాలు, బాత్‌రూమ్‌లను శుభ్రం చేయిస్తూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారు. ఈ తనిఖీలు ఇలానే కొనసాగిస్తే వసతిగృహాల్లో సౌకర్యాలు మెరుగుపడుతాయని విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సరైన వసతులు కల్పిస్తేనే చదువుపై ఏకాగ్రత సాధించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మైనార్టీ బాలికల గురుకులం తనిఖీ చేసిన ఆర్‌ఎల్‌సీ

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 13 : జిల్లా కేంద్రంలోని భగీరథ కాలనీలో గల మైనార్టీ బాలికల-1 గురుకులాలను మంగళవారం జిల్లా రీజినల్ లెవల్ కో ఆర్డినేటర్ (ఆర్‌ఎల్‌సీ) ఖాజాబహూద్దీన్ తనిఖీ చేశారు. బోజనశాలలో విద్యార్థులతో మాట్లాడిన సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. గురుకులాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉంటే ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు దృష్టికి తీసుకవెళ్లాలన్నారు.



భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్‌ఎల్‌సీ

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి

- విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్‌రమణ

మన్ననూర్, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపాలని, హిందువుల రక్షణకు ఐక్యరాజ్యసమితి చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకట్‌రమణ డిమాండ్ చేశారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను వ్యతిరేకిస్తూ మన్ననూరులోని శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై పార్టీలకతీతంగా హిందువులు మంగళవారం నల్లబ్యాడ్జీలను ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. హిందూ దేవాలయాలకు రక్షణ కల్పించాలని, మారణకాండను ఆపాలని డిమాండ్ చేశారు. హిందూ సంఘాల నాయకులు జూలూరి సత్యనారాయణ, సంభు శ్రీనివాసులు, పులిజాల శేఖర్, నర్సింహచార్యులు , నిరంజన్, శరణ్, సురేష్, తిరుపతయ్య, రాజేందర్‌రెడ్డి , మల్లికార్జున్ పాల్గొన్నారు.

సీడ్స్ కార్పొరేషన్‌కు పూర్వవైభవం తీసుకొస్తాం

- రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి
- రైతులకు అధిక దిగుబడినిచ్చే విత్తనాలు అందిస్తాం
- గత ప్రభుత్వం సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేసింది
- విత్తన ఉత్పత్తి, రైతుల బకాయిలు త్వరలోనే చెల్లిస్తాం

వనపర్తి టౌన్, ఆగస్టు 13 : గత పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన సీడ్స్ కార్పొరేషన్‌కు మళ్లీ పూర్వవైభవం తీసుకొస్తామని రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన జిల్లా కేంద్రంలోని విత్తన అభివృద్ధి సంస్థలో రైతులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న కొన్ని ప్రైవేటు కంపెనీలు నేడు ఉంటాయి, రేపు పోతాయి కానీ విత్తన కార్పొరేషన్ మాత్రం పర్మినెంట్‌గా ఉంటుందన్నారు. కొన్ని ప్రైవేటు కంపెనీలు సీడ్స్‌ను రైతులకు అందించి అద్భుతాలు చేసినట్లు పెద్ద ఎత్తున ప్రచారాలు చేసుకుంటున్నాయని విమర్శించారు. సీడ్స్ కార్పొరేషన్ మాత్రం నాణ్యమైన విత్తనాలనే తయారు చేసి రైతులకు అధిక దిగుబడినిచ్చే విత్తనాలనే అందిస్తుందన్నారు. గత ప్రభుత్వం గడిచిన పదేళ్లలో రైతులకు అందించే సబ్సిడీలను పూర్తిగా ఎత్తేసిందని, దీంతో రైతులు అన్యాయానికి గురయ్యారని తెలిపారు. విత్తన ఉత్పత్తి, రైతులకు రావల్సిన బకాయిలను త్వరలోనే చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. విత్తన ఉత్పత్తిదారులైన రైతులకు నష్టం జరగకుండా ధాన్యం కొనుగోలు చేపడతామని, రైతులు ధాన్యాన్ని దించే సమయంలో చెల్లించే హమాలీ ఖర్చులు రైతులపై భారం పడకుండా చూస్తామన్నారు. రబీ సీజన్ నుంచి తృణధాన్యాల విత్తనాలు కూడా సీడ్స్ కార్పొరేషన్ ద్వారా రైతులకు అందిస్తామన్నారు. అనంతరం రైతులు, అధికారులతో కలిసి జిల్లాలోని విత్తన అభివృద్ధి సంస్థను పరిశీలించి మొక్కలు నాటారు. అంతకుముందు జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనను రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో విత్తన కార్పొరేషన్ ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, మార్కెటింగ్ మేనేజర్ ఆదినారాయణరెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, కందుల నాగిరెడ్డి, మాజీ అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్, రాజేంద్రప్రసాద్‌యాదవ్, కౌన్సిలర్ బ్రహ్మంచారి తదితరులు ఉన్నారు.


సీడ్స్ కార్పొరేషన్ విత్తనాలను పరిశీలిస్తున్న సుంకేట అన్వేష్‌రెడ్డి

దొంగతనం చేస్తుండగా పట్టివేత

- సిబ్బందిని అభినందించిన ఎస్పీ

పెబ్బేరు, ఆగస్టు 13 : వనపర్తి జిల్లా పెబ్బేరు బస్టాండ్ సమీపంలో దొంగలు ఓ షాపులో చోరీ చేస్తుండగా పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పెబ్బేరు మునిసిపల్ కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో మార్కెట్ యార్డుకు చెందిన షట్టర్లలో నాగరాజుగౌడ్ అనే వ్యక్తి రియల్ ఎస్టేట్ ఆఫీస్ నడుపుతున్నాడు. సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు షట్టర్ తాళాలను పగులగొట్టారు. ఇద్దరు లోపలికి వెళ్లి దొంగతనం చేస్తుండగా, మరో వ్యక్తి బయట ఉన్నాడు. పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా షట్టర్ ముందు వ్యక్తి తారసపడ్డాడు. అతని వద్దకు పోలీసులు వెళ్లగా పారిపోయాడు. అనుమానం వచ్చి షట్టర్ వద్దకు వెళ్లి చూశారు. షట్టర్ సగం తెరిచి ఉండడంతో పోలీసులు లోపలికి వెళ్లారు. అప్పటికే ఇద్దరు దొంగలు లోపల ఉండటంతో వారిని పట్టుకుని స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేశారు. దొంగలను పట్టుకున్న హెడ్ కానిస్టేబుల్ రాములునాయక్, కానిస్టేబుల్ రవికుమార్, హోం గార్డు కర్ణాకర్‌గౌడ్, డ్రైవర్ మహేష్‌లను మంగళవారం ఎస్పీ రావుల గిరిధర్ అభినందించి, సన్మానించారు. విషయంపై ఎస్సై హరిప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా నేరం జరగకుండా ఆపామని చెప్పారు కానీ దొంగతనానికి పాల్పడిన వ్యక్తుల వివరాలను మాత్రం వెల్లడించలేదు. ఎస్పీ అభినందించిన విషయం గుర్తు చేయగా పెబ్బేరులో గతంలో జరిగిన కేసు విషయంలో అభినందించి ఉంటారని అన్నారు.

అవయవ దానంతో సాటి మనిషి ప్రాణాలు కాపాడుదాం

వనపర్తి వైద్యవిభాగం, ఆగస్టు 13 : ఎంతో విలువైన అవయవాలను మరణించిన తరువాత మట్టిలో కలిసిపోకుండా అవయవ దానం చేసి సాటి మనిషి ప్రాణాలను కాపాడాలని అఖిలభారత అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో అవయవదాన దినోత్సవాన్ని జరుపుకున్నారు. అవయవ దానంపై గూడూరు సీతామహాలక్ష్మి అవగాహన కల్పించారు. సమాజ శ్రేయస్సు కోరి సాటి మనుషులకు అవయవాలను దానం చేయడం అన్ని దానాల్లోకన్నా ఎంతో గొప్పదని అన్నారు. శరీర అవయవాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. మనిషి శరీరంలో నుంచి ఎనిమిది రకాల అవయవాలను దానం చేయొచ్చని తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు భారతి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయచంద్రమోహన్, సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొల్లి ఆదాంరాజ్, విజ్ఞానదర్శిని ఫౌండర్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్, ట్రస్ట్ సభ్యురాలు కన్యాకుమారి, డాక్టర్ సంతోషి, డాక్టర్ బంగారయ్య, సంఘం జిల్లా కన్వీనర్ గంజి కొప్పుల మహేష్, ఆర్మీ కృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌కుమార్‌యాదవ్, కవి జనజ్వాల, సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, ఏసోపు, గంధం భగత్, చంద్రశేఖర్, నందిమల్ల రాములు, గంధం నాగరాజు, శివారెడ్డి, ఉదయ్‌కుమార్, శోభారాణి, బొల్లి భాగ్యమ్మ, మంద ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


అవయవ దానం గురించి మాట్లాడుతున్న గూడూరు సీతామహాలక్ష్మి

మునిసిపల్ కార్యాలయం ముందు వంటావార్పు

జడ్చర్ల, ఆగస్టు 13 : కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ గడిచిన ఎనిమిది రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన మునిసిపల్ కార్మికులు మంగళవారం జడ్చర్ల మునిసిపాలిటీ కార్యాలయం ముందు వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ శానిటేషన్ కార్మికులకు ఒక పూట విధానాన్ని అమలు చేయాలని, కేటగిరి వారీగా వేతనాలు చెల్లించాలని, కార్మికులు ఇవ్వాల్సిన యూనిఫాం, సబ్బులు, నూనె ఇవ్వాలని కోరారు. దశలవారీగా చేస్తున్న పోరాటంలో భాగంగా మునిసిపల్ కార్యాలయం ముందు వంటావార్పు కార్యక్రమం నిర్వహించిన సంఘటనపై కొందరు కౌన్సిలర్లు దురుసుగా వ్యవహరించి, దుర్భాషలాడడాన్ని ఖండించారు. కాగా రాష్ట్రనాయకుల సమక్షంలో చర్చలు జరపా లన్న కార్మికుల విన్నపాన్ని కమిషనర్ ఏకీభవించకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. ఈ కార్య క్రమంలో కార్మిక సంఘం నాయకులు మహేష్, కేశవులు, నరసింహ, అంజమ్మ, అలివేలు, యాదమ్మ, స్వరూప, శ్యామల, యాదయ్య, చంద్రమౌళి, శంకర్, రాజు, శివకుమార్, కార్మికులు పాల్గొన్నారు.


జడ్చర్ల మునిసిపల్ కార్యాలయం ముందు వంట, వార్పు కార్యక్రమం చేపట్టిన కార్మికులు

పరిహారం ఇవ్వాల్సిందే

- ఆర్డీవో కార్యాలయంలో మహిళ ఆందోళన


తనకు న్యాయం జరిగే వరకు కదలనని పోలీసులకు దండం పెడుతున్న మహిళ

గద్వాల, ఆగస్టు 13 : ర్యాలంపాడు రిజర్వాయర్‌లో ముంపునకు గురైన తన పొలం, ఇంటికి పరిహారం అందించాలని ఆలూరు గ్రామానికి చెందిన తిమ్మలమ్మ ఆర్డీవో కార్యాలయంలో ఆందోళన చేపట్టింది. ఆర్డీవోతో పాటు అధికారులను నిలదీసింది. ఆమె తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ర్యాలంపాడు రిజర్వాయర్‌లో ఆమె పొలంతో పాటు ఇల్లు, వాకిలి ముంపునకు గురయ్యాయి. 2018లో పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేయడంతో గ్రామాన్ని పూర్తిగా ఖాళీ చేయాల్సి వచ్చింది. ముంపునకు గురైన ఇళ్లకు పరిహారం అందిస్తే తప్ప ఖాళీ చేయబోమని గ్రామస్థులు తేల్చి చెప్పారు. దీంతో అధికారులు సర్వే చేశారు. ఇళ్లను ఖాళీ చేసేందుకు ఒక్కొక్కరికి రూ.40వేల చొప్పున ఇచ్చారు. మిగిలిన మొత్తం రెండవ దఫాలో ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత పరిహారానికి ఎంపికైన ఇళ్లపై ఫిర్యాదులు రావడంతో కలెక్టర్ విచారణ చేయించారు. అందులో 73 మంది మాత్రమే అర్హులని తేల్చి, వారికి రెండవ విడుత పరహారం ఇస్తున్నారు, మరో 20 మందికి పైగా అప్పటికే పరిహారం అందిందని తేల్చారు. మరో ఐదు గురికి సంబంధించిన స్థలం మీదుగా రోడ్డు వెళ్లిందని, మిగిలిన వారు అనర్హులని తేల్చారు. అందులో తిమ్మలమ్మ కుమారులు మల్లికార్జున్, శ్రీనివాసులు ఉన్నారని ఆర్డీవో కార్యాలయ అధికారులు స్పష్టం చేశారు. దీంతో కార్యాలయంలో ఆందోళనకు దిగింది. తాము అర్హులమే అని, ఎవరో కావాలని పరిహారం రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించింది. పరిహారం ఇవ్వాల్సిందేనని భీష్మించుకొని కూర్చొంది. చివరకు మహిళా పోలీసులు రంగప్రవేశం చేసి ఆమెను అక్కడి నుంచి తీసుకెళ్లారు.

మన్యంకొండలో వీరభద్ర స్వామికి పూజలు

మహబుబ్‌నగర్ రూరల్, ఆగస్టు 13 : మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారికి సన్నిధిలో ఉన్న వీరభద్రస్వామికి శ్రావణ మాస సోమవారం పర్వదినం సందర్భంగా ఉదయం వీరభద్ర స్వామికి ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసంలో 41 రోజులు అఖండ జ్యోతి ప్రజ్వలనతో, అగ్నిగుండం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, అర్చకుల వేద మంత్రాలతో, అభిషేకాలు, పూజలు నిర్వహించారు.


పూజలు చేస్తున్న ఆలయ ధర్మకర్త అళహరి మదుసూధన్ కుమార్

కారు అదుపు తప్పి
నలుగురికి గాయాలు

గోపాల్‌పేట, ఆగస్టు 13 : వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్ర సమీపంలో ఓ కారు అదుపు తప్పడంతో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలంలోని కిష్టగిరి గ్రామానికి చెందిన ఓ కుటుంబం హైదరాబాద్ నుంచి ఏదుల మండలం మాచుపల్లి గ్రామంలో జరిగే ఓ వివాహానికి హాజరయ్యేందుకు వస్తున్నారు. ఈ క్రమంలో గోపాల్‌పేట మండలం ధన్‌సింగ్‌తండా వద్ద కారు అదుపు తప్పి కల్వర్టులోకి దూసుకెళ్లింది. కారు ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. వాహనదారులు, పోలీసులు గాయపడ్డ వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంలో కారు ముందుభాగం ధ్వంసం అయ్యింది.

ఫుడ్‌పాయిజన్‌కు కారణమైన
హాస్టళ్ల ప్రిన్సిపాళ్లను సస్పెండ్ చేయాలి


ధర్నా చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

పాలమూరు, ఆగస్టు 13 : జడ్చర్ల మైనారిటీ బాలుర గురుకుల, నంచర్ల బాలికల ఎస్సీ గురుకులాల్లో విద్యార్థులకు ఫుడ్‌పాయిజన్‌కు కారణమైన ప్రిన్సిపాళ్లను సస్పెండ్ చేయాలని కేవీపీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆది విష్ణు మాట్లాడుతూ ఆగస్టు ఏడున జడ్చర్ల బాలుర మైనారిటీ గురుకులాల్లో విద్యార్థులకు నాసిరకమైన టిఫిన్ తినటంతో వాంతులు చేసుకున్న విషయం పాఠకులకు తెలిసిందేనన్నారు. దానికి కారణమైన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్, కేశవులు, మనోహర్, సురేష్, రాజు, కృష్ణ పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్, ఆగస్టు 13 : పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని మోతీనగర్ సమీపాన రైలు పట్టాల పక్కన గాయాలతో ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని గుర్తించి స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. చికిత్స నిమిత్తం జనరల్ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే చనిపోయినట్లు నిర్ధారించారు. రైలు ఢీకొనడం వల్ల గాయాలైనట్లుగా అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని మార్చ్యురీలో భద్రపరిచారు. కేసు నమోదుచేసుకుని రైల్వే ఎస్సై అక్బర్ దర్యాప్తు చేస్తున్నారు.

నల్లబెల్లం పట్టివేత

- పలువురిపై కేసు నమోదు

నవాబ్‌పేట, ఆగస్టు 13 : కిరాణం షాపులో నల్లబెల్లం విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు బెల్లం కాటన్లను పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నర్సింహారెడ్డి ఆదేశానుసారం మంగళవారం మండల కేంద్రానికి చెందిన శ్రీశైలం అనే వ్యక్తి తన కిరాణం షాపులో కొంతకాలంగా నాటుసారాకు వాడే నల్లబెల్లాన్ని విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో మహబూబ్‌నగర్, పర్గి (వికారాబాద్) జిల్లాలకు చెందిన ఎక్సైజ్ అధికారులు సంయుక్త దాడులు నిర్వహించారు. మండలంలోని కిష్టంపల్లి తండాలో నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకుని అక్కడకు వెళ్లి ఐదు లీటర్ల నాటుసారాను పట్టుకుని సదరు వ్యక్తులను విచారించగా నవాబ్‌పేటలో నల్లబెల్లం తీసుకువస్తున్నామని చెప్పడంతో నవాబ్‌పేటలో తనిఖీలు నిర్వహించి 144 కిలోల నల్లబెల్లం కాటన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐలు వీరారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్ఐలు విక్రం, కరుణ, దయానంద్, సిబ్బంది రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

వంగూరు, ఆగస్టు 13: మండలంలోని డిండిచింతపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను మంగళవారం తెల్లవారుజామున పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. పట్టుపడ్డ ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. వాగుల నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఆర్ఐటీఐ కోర్సుల్లో మిగులు సీట్లకు ప్రవేశాలు

మన్ననూర్, ఆగస్టు 13: అమ్రాబాద్ మండలం మన్ననూరు గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఆర్ఐటీఐ)లో 3వ విడత మిగులు సీట్లను పూరించేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి అంతర్జాలంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఐటీఐ ప్రిన్సిపల్ లక్ష్మణ స్వామి తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, కోపా, మోటారు వెహికిల్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ కోర్సుల్లో దరఖాస్తు చుకోవచ్చునని తెలిపారు. ఈ నెల 17లోగా ఐటీఐ తెలంగాణ వెబ్‌సైట్‌లో దరఖాస్తులను మొబైల్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అనంతరం కౌన్సెలింగ్ ద్వారా అభ్యర్థుల ఎంపిక నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు.

ఉపకరణాలు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయి

- జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు



మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు

కందనూలు, ఆగస్టు 13 : ఉపకరణాలు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు అన్నారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్షా అభియాన్, కృత్రిమ అవయవాల తయారీ సంస్థ(అలింకో) సంయుక్త ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్‌లోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాల పిల్లలకు పరికరాల అందజేత కోసం నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇలాంటి శిబిరాల ద్వారా విద్యార్థులకు అందించే ఉపకరణాలు దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతాయన్నారు. ఈ సందర్భంగా జిల్లా విలీన విద్య కో ఆర్డినేటర్ వెంకటయ్య మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలు విద్యలో రాణించడానికి ఉపకరణాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఈ క్యాంపులో ఎవరికీ ఎలాంటి పరికరాలు అవసరమో గుర్తించినట్లు ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 18ఏళ్లలోపు 102మంది దివ్యాంగులకు దాదాపు 12లక్షల విలువ చేసే చక్రాలు, కుర్చీలు, వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు మొదలైన 233 ఉపకరణాలు కృత్రిమ అవయవాల తయారీ సంస్థ నుంచి వచ్చిన మరో కార్యక్రమంలో అందజేస్తామన్నారు. వైద్యులు అరుణ్, అవినాశ్, మోహన్, ఐఈఆర్‌పీలు, దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు గుర్తించిన మునిసిపల్ చైర్‌పర్సన్



19వ వార్డులో సమస్యలను గుర్తిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య, కౌన్సిలర్ శ్రీదేవి

కొల్లాపూర్, ఆగస్టు 13 : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ప్రజల సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని మునిసిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్య పేర్కొన్నారు. మంగళవారం మునిసిపాలిటీ పరిధిలోని వార్డు కౌన్సిలర్ శ్రీదేవితో కలిసి వార్డులో ఉన్న సమస్యలను గుర్తించారు. మునిసిపల్ కార్యాలయం పక్కన రామమందిరం పక్కన, సంత బజార్‌లోని డ్రైనేజీలను పరిశీలించి పీయూఎఫ్‌ఐడీసీ నిధుల నుంచి వాటి నిర్మాణ పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మునిసిపల్ అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు భీంశెట్టి దిలీప్, మునిసిపల్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మన్యం, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి'

పెంట్లవెల్లి, ఆగస్టు 13: 8 నెలల గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజు గడిస్తే గాని పూట గడవని పంచాయతీ కార్మికులకు నెలలు తరబడి వేతనాలు ఎలా అని వారు ప్రశ్నించారు. పంచాయతీ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని వారు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. చిట్టెమ్మ, మహేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'అవయవదానంతో మరొక ప్రాణానికి వెలుగు'

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 13 : అవయవదానంతో మరొక ప్రాణానికి వెలుగు నివ్వడమేకాక ఆ కుటుంబానికి ఎంతో మేలుచేస్తుందని స్వామివివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివ అన్నాడు. మంగళవారం ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో మైసమ్మదేవాలయంలో అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మరణానంతరం అవయవదానం చేయడం ద్వారా మరొక నిండుప్రాణానికి వెలుగునివ్వగలుగుతారని, యువత అవయదానంపై విస్తృతమైన ప్రచారం చేయాలని తెలిపారు. అనంతరం అవయదానం చేసేందుకు కాలనీవాసులు ముందుకువచ్చి వారిపేర్లను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రసాద్, నర్సింహ, వివేకానంద బాబిదేవ్, సురేందర్‌గౌడు, కాలనీవాసులు పాల్గొన్నారు.

'అందుబాటులో ఎరువులు'

కల్వకుర్తి, ఆగస్టు 13: కల్వకుర్తి పీఏసీఎస్‌లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి కోరారు. మంగళవారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్వకుర్తి పీఏసీఎస్ గోదాములో ఎరువులు 28-28-0 ఎరువు 244 బస్తాలు అందుబాటులో ఉన్నాయని ఒక బ్యాగు ధర రూ. 160, 20-20-0-13 ఎరువు 104 బస్తాలు అందు బాటులో ఉన్నాయన్నారు. అదేవిధంగా డీఏపీ 50 బస్తాలు, ఒక్క బ్యాగు ధర రూ. 1350 అని పేర్కొన్నారు. ఎరువులు అవసరమైన రైతులు అందుబాటులో ఉన్న ఎరువులను తీసుకోవాలని జనార్ధన్‌రెడ్డి కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ శ్యామ్, డైరక్టర్ రామునాయక్ ఉన్నారు.

హైదరాబాద్‌కు బయలుదేరిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ఊర్కొండ, ఆగస్టు 13: ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టులో విజయం సాధించి హైదరాబాద్ నగరానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ వస్తున్నందున స్వాగతం పలకడానికి మండల కేంద్రం నుండి భారీగా ఎమ్మార్పీఎస్ నాయకులు హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దారా రాధా కృష్ణ మాదిగ, నాయకులు రాజు మాదిగ, వాడ్యాల శివ, కొమ్ము శ్రీను, లక్ష్మణ్, పులిజాల చంద్రకాంత్, మొండేళ్ల శ్రీశైలం పరమేష్, రవి, మహేష్, రాజు అంజి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

తిమ్మాజిపేట: ఎస్సీల వర్గీకరణకు సుప్రీంకోర్టు రాష్ట్రాలకు బాధ్యతను అప్పగించడం హర్షదాయకమని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏబీసీడీ వర్గీకరణ వెంటనే చేపట్టాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు దానం జగన్‌రాజ్ డిమాండ్ చేశారు. తిమ్మాజిపేట మండల కేంద్రానికి సోమవారం పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున వాహనాలలో చేరుకున్న ఎమ్మార్పీఎస్ నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. ఎస్సీ వర్గీకరణ సాధించి ఢిల్లీ నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వస్తున్న దండోరా దళపతి మందకృష్ణ మాదిగకు ఘన స్వాగతం పలికేందుకు హైదరాబాద్ తరలివెళ్లారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు జోగు ప్రదీప్, వెంకటేశ్, ప్రశాంత్, కాలరాజు, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌బహదూర్, దానం బాలరాజు, దేవస్వామి, శ్రీరామ్, ఎమ్మార్పీఎస్ నాయకులు మీదింటి సురేందర్, పరుశరాములు ఉన్నారు.

కాయితీ ప్రభాకర్‌రెడ్డి ఆశయాలు కొనసాగిద్దాం



ప్రభాకర్‌రెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 13: పీఏసీఎస్ మాజీ చైర్మన్, దివంగత కాయితీ ప్రభాకర్ రెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి మండలం తాండ్రా గ్రామంలో మంగళవారం దివంగత కాయితీ ప్రభాకర్‌రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కాయితీ ఆశాదీప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి, పలువురు ప్రముఖులు, నాయకులు హాజరై ప్రభాకర్‌రెడ్డి చిత్ర పటానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభాకర్‌రెడ్డి రైతుల అభ్యున్నతికి ప్రజా సంక్షేమం కోసం తన జీవితాంతం పరితపించారని కొనియాడారు. పొల్యూషన్‌బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్, కాయితీ సాయిరెడ్డి, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, వెల్దండ మాజీ సర్పంచ్ ఎన్నం భూపతిరెడ్డి, పలువురు నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజాపాలన

- ● కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి
- ● తిమ్మరాశిపల్లిలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, అమరవీరుల స్తూపం ఆవిష్కరించిన ఎమ్మెల్యే



తిమ్మరాశిపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, ఆగస్టు 13: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన కొనసాగుతున్నదని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. ప్రపంచ దేశాలకు భారత రాజ్యాంగం ఆదర్శంగా నిలిచిందని అన్నారు.

కల్వకుర్తి పట్టణ పరిధిలోని తిమ్మరాశిపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, అమరవీరుల స్తూపాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల వల్ల సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడ్డ వారికి రిజర్వేషన్ సదుపాయం తక్కువగా కల్పించినట్లు గుర్తు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకపోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉందని పేర్కొన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగంలో చిన్న చిన్న రాష్ట్రాలు ఏర్పాటు చేసుకోవచ్చని పొందుపర్చడం వల్లే తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగ బద్దంగా, ప్రజల పోరాట ఫలితంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని రచించి దేశానికి దిక్సూచిగా నిలిచిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని, తెలంగాణ ఏర్పాటుకోసం ప్రాణాలర్పించిన అమరవీరుల స్తూపాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు ఠాగూర్ బాలాజీసింగ్, మునిసిపల్ చైర్మన్ యడ్మ సత్యం, కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కౌన్సిలర్లు నేరటి రవీందర్, గోరటి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి, మిరియాల శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, పర్వత్‌రెడ్డి, సత్యనారయణరెడ్డి, పలువురు నాయకులు, తిమ్మరాశిపల్లి గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదాకోసం కాంగ్రెస్ ఉద్యమించాలి



వెల్దండ సమీపంలో కేఎల్ఐ కాలువను పరిశీలిస్తున్న జైపాల్‌యాదవ్

వెల్దండ, ఆగస్టు 13 : లక్షలాది ఎకరాలకు సాగునీరందించే పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాకై కాంగ్రెస్ పార్టీ ఉద్యమిస్తే అందుకు బీఆర్ఎస్ కలిసివస్తుందని మాజీ ఎమ్మెల్యే గుర్క జైపాల్‌యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుండాల సమీపంలో కేఎల్ఐ కాలువను స్థానిక నాయకులతో కలిసి జైపాల్‌యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం కల్వకుర్తి ఎత్తిపోతల పేరుతో కేఎల్ఐ ఉన్నా నియోజకవర్గానికి సరైన సాగునీటి వసతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైనా కాలువలో ఎక్కడికక్కడ చెట్టుమొలిచిపోయాయని, నిర్వహణలోపం స్పష్టంగా కనిపిస్తుందని మండిపడ్డారు. వ్యవసాయ ప్రణాళికలు రూపొందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని ధ్వజమెత్తారు. ఇప్పటివరకు రైతుభరోసా ఇవ్వలేదని, రుణమాఫీ అంతంతమాత్రంగా చేసి చేతులుదులుపుకున్నారని విమర్శించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కేఎల్ఐ కాలువకు రిజర్వాయర్ల అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంలో మార్పురావాలని, రైతులను గోసకు గురిచేయొద్దని జైపాల్‌యాదవ్ సూచించారు. మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శేఖర్, నాయకులు చల్ల మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌రావు, హన్మంతు, తిరుమల్‌రావు, లింగం, రాజునాయక్, నాగయ్య తదితరులు ఉన్నారు.

ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

- భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జానకీ



అచ్చంపేటలో ర్యాలీలో పాల్గొన్న జానకి తదితరులు

అచ్చంపేటటౌన్, ఆగస్టు 13: ప్రతీ ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు జానకి అన్నారు. హర్ ఘర్ తిరంగా అభియాన్ తిరంగా యాత్రలో భాగంగా మంగళవారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందల సంవత్సరాలుగా లక్షలాదిమంది భారతమాత ముద్దుబిడ్డలు నా దేశానికి స్వేచ్ఛ కావాలని స్వాతంత్ర్యం రావాలని పరాయి పాలకుల పీడ పోవాలని ఎంతో మంది అమరులయ్యారన్నారు. ప్రతీ ఒక్కరు ఇంటిపై జెండా ఎగరవేసి దేశభక్తి చాటుదామన్నారు. నాయకులు బాలాజీ, రవీందర్, చందులాల్, నరేష్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి

పెద్దకొత్తపల్లి: జాతీయ సమైక్యత కోసం ప్రతీ ఒక్కరు జాతీయ భావం పెంపొందించుకోవాలని తహసీల్దార్ ఎండి.యూసుఫ్ ఆలీ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలో తపాలా ఉద్యోగుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఘర్ ఘర్ తిరంగా జెండా ర్యాలీని ఆయన జాతీయజెండా ఊపి ప్రారంభించారు. సబ్ పోస్టుమాస్టర్ రవికుమార్, గ్రామీణ తపాలా సిబ్బంది మల్లేష్, గోపాల్‌రావు, శశి, లిఖిత, నిరంజన్, ఉమా, మహేష్, శంకర్, రాకేష్, శ్యామలా, హేమాపాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో జాతీయ జెండాలతో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

కందనూలు: బీజేపీ జాతీయ పార్టీ పిలుపు మేరకు ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ వీధుల గుండా పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహిస్తూ బీజేపీ ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి మాట్లాడుతూ ప్రజలందరూ ఒకే దేశం ఒకే నినాదంతో ముందుకెళ్లాలని, దేశానికి ఎల్లప్పుడు వెన్నంటే ఉంటూ దేశం కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టారన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన మహానాయకులకు వారి త్యాగాలను ముందుతరాలకు తెలియజేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఘర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్ నీరకంటి రాఘవేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, నారాయణచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్ల రాజావర్ధన్‌రెడ్డి, నరేష్‌చారి, రాము, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛదనంపై మరింత శ్రద్ధ పెరగాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, జిల్లా అధికారులు

కందనూలు, ఆగస్టు 13 : గ్రామాల్లో స్వచ్ఛదనంపై మరింత శ్రద్ధ పెరగాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులకు సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేసిన అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం స్వయం సహాయక సంఘాల బలోపేతంపై అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులతో మంగళవారం రాష్ట్ర బీఆర్ అంబేడ్కర్ సచివాలయం నుంచి మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారుల నుంచి పారిశుద్ధ్య కార్మికుల వరకు బాగా కష్టపడి పనులు చేశారన్నారు. మంచి పనితీరు కనబర్చిన సిబ్బందిని ఆగస్టు15న సన్మానిస్తామని పేర్కొన్నారు. గతాన్ని పోల్చితే ఎక్కువ పని జరిగిందని, దాన్ని మరింత మెరుగుపర్చాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. మండలాల వారి రివ్యూలు చేసి సమగ్ర నివేదికలు ఇవ్వాలని సూచించారు. ఇక నుంచి ప్రతీ నెల మూడు రోజుల పాటు స్వచ్ఛదనం-పచ్చదనంపై డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని పారిశుద్ధ్యం లోపాలపై పత్రికల్లో వార్తలు వస్తే సరిదిద్దుకోవాలని సూచించారు. సర్పంచ్ ఎన్నికల వరకు అధికారులు ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలన్నారు. గ్రామపంచాయతీ స్పెషల్ అధికారులు ఉదయం కనీసం మూడు గంటలపాటు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రతిరోజు సిబ్బంది అటెండెన్స్‌తో పాటు వారు పనుల వివరాలను తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మరో జత యూనిఫామ్‌లు సిద్ధం చేసి పంపిణీ చేయాలని అన్నారు. మహిళా సంఘాల సభ్యత్వాన్ని కోటి మందికి చేర్చాలని మహిళా శక్తి ప్రోగ్రామ్‌లో ఎస్సీ, ఎస్టీ మహిళల భాగస్వామ్యం పెంచాలని సూచించారు. అధికారులు ఆవాస గ్రామాల్లో పర్యటించి మహిళా శక్తిలో చేర్పించాలన్నారు. గ్రామాల్లో జ్వర సర్వేలు చేసి జ్వర నివారణకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. జిల్లా వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ కే.సీతారామారావు, పీడీ డీఆర్‌డీఏ చిన్న ఓబులేష్, జడ్పీ సీఈవో దేవసహాయం, అదనపు డీఆర్‌డీఏ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సహజమే



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాస్

కందనూలు, ఆగస్టు 13 : ఉద్యోగులకు బదిలీలు సహజమేనని ఉద్యోగరీత్యా బదిలీ ఎక్కడ చేసినా ఆ ప్రాంతంలో సేవలు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాస్ అన్నారు. పెద్దముద్దునూర్ పీహెచ్‌సీ పరిధిలోని వైద్య సిబ్బంది కేశవులు, రజితమ్మ, శంకరమ్మలు బదిలీపై వెళ్తున్న సందర్భంగా నిర్వహించిన వీడ్కోలు సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వైద్యులు రవినాయక్, దశరథం పాల్గొన్నారు. అనంతరం బదిలీ అయిన వారికి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

రక్తదాన శిబిరం

కందనూలు, ఆగస్టు 13 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మైల్‌స్టోన్ యూత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డులో గురువారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు మైల్‌స్టోన్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. గత ఆరు సంవత్సరాలుగా మైల్‌స్టోన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. రక్తదానం చేసి ప్రాణాలను కాపాడేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చి కార్యక్రమం చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు.

'మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 13 : తెలంగాణ మధ్యాహ్నభోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమాన్ని చేపట్టి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వారికి నెలకు రూ.10వేలు అందజేస్తామని ఇచ్చిన హామీని అమలుచేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజనపథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ మండల అధ్యక్షురాలు అనురాధ, ఉపాధ్యక్షురాలు నిర్మల, కార్మికులు యాదమ్మ, అలివేలు, షమీం, సైదాబేగం, బుచ్చమ్మ, కొండమ్మ, పద్మ తదితరులు పాల్గన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసిన సీడీపీవో

లింగాల, ఆగస్టు 13 : మండల పరిధిలోని లింగాల, రాయవరం, ధారారం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం ఐసీడీఎస్ సీడీపీవో దమయంతి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఆయా కేంద్రాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ముఖ్యంగా అంగన్‌వాడీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని అంగన్‌వాడీ టీచర్లను ఆదేశించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ప్రతి అంగన్‌వాడీ కేంద్రాల దగ్గర జాతీయ జెండాను ఎగురవేయాలని, కేంద్రాల్లో పండుగ వాతావరణం రూపొందించాలని అన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్ గిరిజా, ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు ఉన్నారు.

'అనుమతి లేనిదే అడవిలోకి ప్రవేశించొద్దు'

కొల్లాపూర్, ఆగస్టు 13 : అటవీ శాఖ అనుమతి లేనిదే నల్లమలలోకి ఎవరూ ప్రవేశించవద్దని ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో నల్లమలలో వన్యప్రాణుల సంతానోత్పత్తిజరిగే సమయమని అటవీ పరిసర గ్రామాల ప్రజలు నల్లమలలోకి ప్రవేశించకుండా ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే నల్లమలలో సీసీ కెమెరాల నిఘా పెట్టినట్లు ఆయన తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకల కాపు కోసం నల్లమలలో ప్రవేశించవద్దని అటవీ అధికారులకు సహకరించాలని పేర్కొన్నారు. ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ ముజీబ్‌ఘోరీ, ఫారెస్టు సిబ్బంది అంకిపెంట ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

'ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలి'

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 13 : ప్రభుత్వఆసుపత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ఆసుపత్రికి వెళ్లగా రోగులు తమ సమస్యలు తెలియజేశారని, వరండాల్లో ఉన్న బెడ్స్‌పై బాలింతలను పడుకోబెడుతున్నారని, వారికి దోమలు, ఈగలబెడద ఎక్కువగా ఉంటుందని అన్నారు. ఆసుత్రిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న స్వీపర్స్‌కు గత ఆరునెలలుగా జీతాలు రావడం లేదని, వారికి జీతాలువచ్చే విధంగా చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాంను కలిసి మంగళవారం వినతి పత్రం అందజేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా అధ్యక్షుడు చింత ఆంజనేయులు, సీపీఎం మండల నాయకుడు సిద్దయ్య పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు



ఎల్లమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

అమ్రాబాద్, ఆగస్టు13: అమ్రాబాద్ మండలం తిర్మలాపూర్‌లోని ఎల్లమ్మ తల్లి దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం రెండో మంగళవారాన్ని పురస్కరించుకొని భక్తులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించిన షెడ్డులో భక్తులు వంటలు చేసి అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఉమామహేశ్వర పాలకమండలి సభ్యురాలు సంబు శోభ, ఆలయ అర్చకులు వెంకటయ్య, కృష్ణ, శ్రీశైలం, ఆర్యవైశ్యసంఘం నాయకులు జూలూరి సత్యనారాయణ, సంబు వెంకటరమణ, పద్మజ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందాలి'

అచ్చంపేటటౌన్, ఆగస్టు 13: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఒక్కరికి అందేలా చూడాలని మునిసిపల్ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పట్టణంలోని మారుతీనగర్ కాలనీలో పట్టణ అధ్యక్షుడు కటకం రఘురాం ఆధ్వర్యంలో ఫైవ్‌మాన్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందుతున్నాయో లేదో అని ఈ కమిటీ పరిశీలిస్తుందన్నారు. కమిటీ సభ్యులుగా ఆరిఫ్, శేఖర్, నరేష్, రమేష్ గౌడ్, సుజాతలను ఎన్నుకున్నారు. నాయకులు శారద, రామనాథం, మస్తాన్, రాములు, శేఖర్, మహబూబ్ పాల్గొన్నారు.

కోతికి భయపడి కిందపడ్డ మహిళ

వెల్దండ, ఆగస్టు 13 : మండల కేంద్రంలో భవన నిర్మాణానికి వచ్చిన ఓ మహిళ కోతికి భయపడి కిందపడింది. చత్తీస్‌ఘడ్‌కు చెందిన ఫాతిమా నిర్మాణంలో ఉన్న భవనానికి నీళ్లు కొట్టేందుకు కూలీపనికి వచ్చింది. అక్కడికి కోతులు రావడంతో ఎక్కడ తనపై దాడిచేస్తాయోనని భయపడి కిందకు దూకింది. దీంతో మహిళకు గాయాలయ్యాయి. దీంతో ఆమెను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలి

తెలకపల్లి, ఆగస్టు 13 : మధ్యాహ్న భోజన పథకాన్ని హరే రామ హరే కృష్ణ సంస్థకు అప్పజెప్పడాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేపట్టారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మార్వోకు అందజేశారు. మధ్యాహ్న భోజన సంఘం మండల అధ్యక్షురాలు మండల కార్యదర్శి ప్రశాంతి, చెన్నమ్మ, లక్ష్మీ, బంగారమ్మ, రాములమ్మ, పద్మ, గోవిందమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

వంట నిర్వహణ బాధ్యత మహిళా సంఘాలకే ఇవ్వాలి

వంగూరు, ఆగస్టు 13: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన నిర్వాహణ బాధ్యత స్వచ్ఛంద సంస్థలకు అప్పజెప్పవద్దని, మహిళా సంఘాలకే ఇవ్వాలని కోరుతూ మంగళవారం వంగూరులో ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు కొద్ది సేపు కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు రాములు మాట్లాడుతూ హరేరామ హరేరామా అనే స్వచ్ఛంద సంస్థకు మధ్యాహ్నభోజన నిర్వహణ ప్రభుత్వం అప్పజెప్పేందుకు ప్రయత్నిస్తుందని, వెంటనే అలాంటి ఆలోచనను విరమించుకోవాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కలమ్మ, తిరుపతయ్య, భారతమ్మ, బుచ్చమ్మ, పద్మమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

జై భీమ్ యూత్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ఊర్కొండ, ఆగస్టు 13: మండల కేంద్రంలో జై భీమ్ యూత్ అసోసియేషన్ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోలె భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా పంజుగుల భాస్కర్, ఉపాధ్యక్షులుగా ఆకుల దయాకర్, రమేష్ , కోశాధికారి రామస్వామి, కార్యదర్శులు అనిల్ కుమార్, దారా గోపాల్ తదితర కార్యవర్గం గుమ్మకొండ శివ, ఆంజనేయులు, నరేష్ శేఖర, శివ సమరేశ్, మల్లేష్, సుధాకర్ తదితరులు ఎన్నికయ్యారు.

విద్యార్థులకు దాతలు చేయూతనివ్వాలి

ఊర్కొండ, ఆగస్టు 13: ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసించే వారికి ముందుకు వచ్చి సహాయ, సహకారాలు అందించాలని ఇన్‌చార్జి మండల విద్యాధికారి శంకర్ నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని ఊర్కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 110 మంది విద్యార్థులకు దివంగత హైమావతి జ్ఞాపకార్థం ఆమె భర్త రిటైర్డ్ ఉపాధ్యాయులు నరసింహ పరీక్ష ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, అట్లాస్‌లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు మురళి మోహన్ గౌడ్, ఉపాధ్యాయులు హబీబున్నిసా బేగం, ప్రసాద్ నాయుడు, శివకుమార్, చంద్రశేఖర్, పాండయ్య ఉన్నారు.

చెంచు పెంటల్లో వైద్య సేవలందించాలి

మన్ననూర్, ఆగస్టు 13: సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని నల్లమల ప్రాంతంలోని చెంచు పెంటల్లో వైద్యాధికారులు సిబ్బంది చెంచులకు వైద్య సేవలందించాలని జిల్లా హెల్త్ మిషన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాసులు కోరా రు. నల్లమల అభయారణ్య ప్రాంతంలోని అప్పాపూర్, భౌరాపూర్, పుల్లాయ పల్లి, రాంపూర్ పెంటల్లో జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో అస్వస్థులైన మహిళలు, వృద్ధులు, బాలిం తలు, చిన్నారులకు ఆరోగ్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వటవర్లపల్లి వైద్యాధికారి డాక్టర్ అభిలాష్, కమ్యూనిటీ హెల్త్ అధికారి అశోక్ ప్రసాద్, జిల్లా ప్యారామెడికల్ అధికారి మధుమోహన్, ఆరోగ్య సహాయకులు రాజేష్, లోక్య, సరోజ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం విజయవంతం

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 13 : మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మంగళవారం కొట్ర బాలాజీ నేత్రాధికారి ఆధ్వర్యంలో కంటి పరీ క్షలు నిర్వహించారు. ప్రతీ మంగళవారం పెద్దకొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేం ద్రంలో కంటి పరీక్ష శిబిరాలను ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ అశ్విని, ల్యాబ్ టెక్నిషియన్ లక్ష్మీనరసింహగౌడ్, వైద్య సిబ్బంది సంపత్‌కుమార్, ఫార్మాసి స్టు చెన్నమ్మ, ఆయుష్ ఫార్మాసిస్టు శివ, నాగమణి, ఆరోగ్య కార్యకర్తలుపాల్గొన్నారు.

విద్యార్థులకు బూట్లు, సాక్సులు అందజేత

బిజినేపల్లి, ఆగస్టు 13 : మండలంలోని మమ్మాయిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న 46 మంది విద్యార్థులకు మంగళవారం మాజీ జడ్పీటీసీ సభ్యుడు బూట్లు, సాక్సులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం వకుల, ఉపాధ్యాయులు బాలసాగర్, ప్రియదర్శిని, అనంత రెడ్డి ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కోడేరు, ఆగస్టు 13 : కోడేరు మండల కేంద్రానికి చెందిన ఆరుగురికి ప్రభుత్వం నుంచి మంజూరైన మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులతోపాటు మాజీ మండల పరిషత్ కో ఆప్షన్ మెంబరు ఎస్‌కే.అబ్దుల్ కరీం పంపిణీ చేశారు. కాంగ్రెస్ నాయకుడు ఆర్.జగదీశ్వర్ సురేష్‌యాదవ్, ఆదిరాజు, ఆదిశరత్, మిద్దెనగేష్, సొప్పరి నరసింహ, బాలకృష్ణ, గోపాల్, దూరెడ్డి సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

'అటవీ జంతువులకు హాని తలపెట్టొద్దు'

బిజినేపల్లి, ఆగస్టు 13 : అటవీ పరిసర ప్రాంతాల్లోని పొలాలకు అటవీ జంతువులకు ఎలాంటి హాని తలపెట్టకుండా ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలని ఎఫ్ఆర్‌వో దేవరాజు కోరారు. మండలంలోని గంగారం ఫారెస్టు సమీపంలో తండాలు పెద్ద తండా, కీమ్యాతండా, క్షేత్రబండ తండాల్లోని ప్రజలకు మంగళవారం అటవీ జంతువుల సంచారం, వాటి జీవన శైలిపై అవగాహన కల్పించారు. ఈ మధ్యకాలంలో ఫారెస్టులో చిరుతల సంచారం వెలుగులోకి రావడంతో గిరిజనతండాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఎవరికైనా అటవీ జంతువులు కనిపిస్తే వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే అటవీ సమీపంలోని పొలాల్లో పశువులను ఉంచకుండా ఇంటి వద్ద కట్టేసుకోవాలని తెలిపారు. అలాగే రాత్రి వేళలో పొలాలకు వెళ్లాల్సి వస్తే గుంపులుగా వెళ్లాలని సూచించారు. అనుమతి లేకుండా ఎవ్వరు కూడా అటవీ ప్రాంతంలోకి వెళ్లకూడదని పేర్కొన్నారు. అటవీ జంతువుల సంరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని అలాగే వాటిని రక్షించుకోవడం వల్ల అటవీ నాశనం కాదని వివరించారు. చిరుతపులి పొలాల్లోకి వచ్చిందన్న వదంతులతో మన్ననూరు నుంచి రిస్క్యూ టీం రప్పించి గాలించారు. అక్కడ కనబడిన పాదముద్రలు పరిశీలించి గోల్డెన్ ఊల్ఫ్ గుర్తించినట్లు ఆయన తెలిపారు.